క్లుప్తంగా

రామయ్యకు ఘన సన్మానం



ఉద్యోగ విరమణ పొందిన సోల్జర్ రామయ్యను సన్మానిస్తున్న గ్రామస్తులు

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన దేశబోయిన రామయ్య కొన్నేళ్లుగా ఆర్మీలో సోల్జర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందాడు. దీంతో గురువారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ఆర్మీలో దేశ భద్రత కోసం రామయ్య చేసిన సేవలు మరవలేనివని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తమ్మనబోయిన శంకర్, ఎంపీటీసీ మండవ శైలజమధు, దేశబోయిన జానకీరాములు, బూర లక్ష్మీనారాయణ, గంగ్రె యాదగిరి, శ్రీను, బాబు, నాగయ్య, కొండలు, బ్రహ్మం, నరసింహ, రామస్వామి పాల్గొన్నారు.

నేడు కోదాడకు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కోదాడ : చిలుకూరు మండలంలోని బేతవోలులో జరిగే కనకదుర్గమ్మ జాతరలో పాల్గొనేందుకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం కోదాడకు వస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ఈసీ మెంబర్ పిల్లుట్ల శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోదాడ నియోజకవర్గ పరిధిలోని మాధవరం నుంచి బైక్‌ర్యాలీ, కారు ర్యాలీతో ఆయనకు ఘనస్వాగతం పలకనున్నట్లు పార్టీ నాయకుడు కె.శ్రావణ్‌కుమార్ తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలి



పుస్తకాలను విడుదల చేస్తున్న చైర్మన్, కమిటీ సభ్యులు

చిలుకూరు : విద్యార్థులు పోటీ పరీక్షల పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అంబాల వెంకటి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయం సంస్థ నుంచి వచ్చిన పుస్తకాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ డైరెక్టర్ కస్తూరి నర్సయ్య, కమిటీ సభ్యులు పిల్లుట్ల కృష్ణయ్య, రీడర్స్ ఫోరం అధ్యక్షుడు బోయిళ్ల రాజు, గ్రంథాలయం అధికారి సైదులు, పాఠశాల హెచ్‌ఎం జగన్‌మోహన్‌రావు, రమణ, సుమలత పాల్గొన్నారు.

భోజనశాల నిర్మాణానికి విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిమందిరం ఆవరణలో నిర్మించనున్న భోజనశాల నిర్మాణానికి దివంగత వీరవల్లి శంకర్‌రావు –విజయలక్ష్మి జ్ఞాపకార్థంగా వారి కూతురు తారకేశ్వరి గురువారం రూ.25వేల విరాళం ట్రస్టు సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో శ్రీ షిర్డీ సాయి ట్రస్టు అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, గౌరవసలహాదారులు పసుపులేటి భిక్షం, జల్లా గణేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పవళింపు సేవ



పవళింపు సేవలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం పవళింపు సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రాతకాలార్చనలు, ప్రత్యేక పూజలు జరిపించారు. సాయంకాలం ఆలయంలోని అద్దాల మండపంలో గల ఊయలను పట్టువస్త్రాలు, పూలమాలలు, పట్టుపరుపులతో అందంగా అలంకరించి స్వామి, అమ్మవార్లను ఊయలలో ఉంచి శ్రావ్యంగా గానం చేస్తూ పవళింపు సేవ జరిపించారు. కార్యక్రమంలో ఆలయం ఈఓ, అర్చకులు, స్థానాచార్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. పది మందికి గాయాలు

కూసుమంచి: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా కొట్టగా పది మందికి గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం చనుపల్లి గ్రామానికి చెందిన కూలీలు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని నేలపట్లలో ఓ రైతు చేనులో మిర్చి ఏరేందుకు ఆటోలో వస్తున్నారు. ఈ క్రమంలో వీరన్న స్వామి ఆలయం వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో ఆటో బోల్తా కొట్టింది. దీంతో కూలీలపై ఆటో పడగా వారు గాయపడ్డారు. వాహనదారులు ఆటోను లేపి కూలీలను 108లో ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో గొట్టిముక్కల ఉమ, పద్మకు తీవ్ర గాయాలు కాగా, మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి.

వేధిస్తున్న పశువైద్యుల కొరత

- గణపవరం, తొగర్రాయి సబ్‌సెంటర్లలో సిబ్బంది నిల్
- మూగజీవాలకు సకాలంలో అందని వైద్యం
- ఇబ్బందులు పడుతున్న పాడిరైతులు



గణపవరం పశువైద్యశాల

కోదాడరూరల్ : మండలంలోని పలు పశువైద్యశాలలో సిబ్బంది కొరత వేధిస్తుంది. దీంతో మూగజీవాలకు సకాలంలో వైద్యం చేసేందుకు సిబ్బంది లేక పాడిరైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు పశు సంపదను అభివృద్ధి చేస్తాం అందుకు నిధులకు పెద్ద పీటవేస్తున్నాం అంటున్నారనే వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఇక మండలంలోని ప్రధాన పశువైద్య సెంటర్‌లు ఎరవరం, కాపుగల్లు గ్రామాల్లో ఉన్నాయి. అదే విధంగా వాటి పరిధిలో 7సబ్‌సెంటర్‌లు ఉన్నాయి. తొగరాయి, గణపవరం, గుడిబండ, నల్లబండగూడెం, చిమిర్యాల, తమ్మర, కొమరబండ గ్రామాల్లో సబ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఇందులో పలు సబ్‌సెంటర్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిలో సిబ్బంది విధులు నిర్వహించే పరిస్థితి కూడా లేదు. మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీలైన గణపవరం, తొగర్రాయి పశువైద్య సబ్‌సెంటర్లలో ఒక్కరూ కూడా సిబ్బంది లేక ఆయా గ్రామాల పాడిరైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్లుగా ఇక్కడ వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో మూగజీవాలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. ఇటీవల వేరే చోట విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని వారంలో రెండు రోజులు ఇన్‌చార్జ్‌గా ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఈ రెండు గ్రామాల్లో జీవాలు 1500, పశువుల 100వరకు ఉన్నాయి. ఇక్కడ వైద్యసిబ్బంది లేకపోవడంతో దూరంగా ఉన్న సెంటర్‌కు పశువులు, జీవాలను తీసుకెళ్లడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ప్రభుత్వం అన్ని పశువైద్యశాలు, సబ్‌సెంటర్లలో పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించి పాడి, జీవాల పెంపకందారులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆయా గ్రామాల్లో రైతులు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరుకున్న సెంటర్‌లు..

ఇక మండలంలోని పలు సబ్ సెంటర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. తొగర్రాయి, నల్లబండగూడెంలో మాత్రమే నూతనంగా నిర్మించగా మిగిలిన గణపవరం, కొమరబండ, తమ్మర, చిమిర్యాల సెంటర్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి.

వైద్యసిబ్బందిని నియమించాలి



గణపవరం పశువైద్యశాల సబ్‌సెంటర్‌లో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించి పాడి, జీవాల పెంపకందారులకు ఇబ్బంది లేకుండా చూడాలి. ఇక్కడ జీవాలు, గేదెలపై ఆధారపడి అనేక మంది రైతులు ఉన్నారు. వైద్యసిబ్బంది లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.

– సింగారెడ్డి హిమబిందు, గణపవరం, ఎంపీటీసీ

రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం



మండలంలోని గణపవరం, తొగర్రాయి సబ్‌సెంటర్‌లలో ఖాళీగా ఉన్న సిబ్బందిని నియమించాలని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. త్వరలోనే నియమించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆ రెండు చోట్ల ఇన్‌చార్జులను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

– నాగేంద్రబాబు, మండల పశువైద్యాధికారి

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ సైదిరెడ్డి, తదితరులు

హుజూర్‌నగర్ రూరల్ : క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని అమరవరంలో లింగమంతుల జాతర సందర్భంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు, క్రీకారులకు ఎంతో ప్రోత్సాహం కల్పిస్తుందని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు, చదువుల్లో, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించిందన్నారు. అనంతరం దాతలతో కలిసి గెలుపొందిన విజేతలు కల్లూరు మొదటి బహుమతి రూ.20వేల116, సర్వారం ద్వితీయ రూ.15వేల116, నడిగూడెం తృతీయ బహుమతి రూ.10వేల116 నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దూబ బాలసైదులు, కదిర వెంకటరెడ్డి, పార్టీ నాయకులు అంజిరెడ్డి, అలీపాషా, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, లింగారెడ్డి, కేశవరెడ్డి, సుధీర్‌రెడ్డి, గోపి, సతీష్, ఉపేందర్‌రెడ్డి, దాతలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెంపు



ఎరువును తయారు చేస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

మోతె : ప్రకృతి వ్యవసాయంతోనే భూసారం పెరుగుతుందని అరవిందో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎ.కిరణ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని సిరికొండలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంతో పంటలు అధికంగా దిగుబడి వస్తాయన్నారు. విదేశి పరిజ్ఞానాన్ని వదిలి వ్యవసాయంలో పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. పెరుగుతున్న భూతాపం, వాతావరణ మార్పులకు గోఆధారిత వ్యవసాయం సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు నరేష్, మండల విస్తరణ అధికారి కార్తీక్, రైతులు మల్లారావు, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన



శివాలయంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి, సీఐ, ఎస్‌ఐ

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శివాలయంలో ఈనెల 18నుంచి 24వరకు జరగనున్న మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను కోదాడ డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ముందుగా స్వామిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడారు. దర్శనమార్గాలు, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట సీఐ నాగదుర్గప్రసాద్, సురేష్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి హెచ్చరించారు. చింతలపాలెం మండలంలోని తమ్మారం గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామస్తులు శాంతియుత వాతావరణలో ఉండాలని, శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలన్నారు. అసాంఘిక చర్యలకు పాల్పడితే ఉక్కుపాదంతో అణచివేస్తామన్నారు. అల్లర్లకు పాల్పడితే ఎంతటి వారినైనా వదిలేది లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట కోదాడరూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, ఎస్‌ఐ కృష్ణారెడ్డి, గ్రామపెద్దలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

తెలంగాణలో రాజన్న రాజ్యం సాధనకు కృషి



వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వెంకటేశ్వర్లు తదితరులు

నేరేడుచర్ల : తెలంగాణలో రాజన్న రాజ్యం సాధించేందుకు కృషి చేస్తామని వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ జిల్లెపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని దిర్శించర్ల గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన యువకులు వైఎస్సార్ తెలంగాణ పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. అనంతరం దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఇంటికో ఉద్యోగం, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని, దళితులకు మూడెకరాల భూమి, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని హామీలు ఇచ్చిన కేసీఆర్ మాటతప్పడమే బంగారు తెలంగాణ అని ప్రశ్నించారు. తెలంగాణలో పార్టీ అధ్యక్షురాలు షర్మిల నాయకత్వంలో వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధికారంలోకి ఖాయమన్నారు. తెలంగాణ 108 సేవలు, ఆరోగ్య శ్రీ సేవలు, రైతులకు రుణమాఫీ, విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, పేదలకు పక్కా గృహాలు వంటి పథకాలను అమలు చేస్తామన్నారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడిగా తురుక శ్రీను, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పంగా బుచ్చిబాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా తిప్పన గోవర్ధన్‌రెడ్డి, మహిళా జిల్లా అధ్యక్షురాలిగా మర్రి యశోధారెడ్డిని నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు తండు భాస్కర్‌గౌడ్, మండల పరిశీలకుడు మర్రి రవీందర్‌రెడ్డి, పార్టీ నాయకులు కామిశెట్టి రవి, సుతారి శ్రీను, మురళి, హుస్సేన్, నాగరాజు తదితరులున్నారు.

పథకాలు ప్రజలకు అందేవిధంగా చూడాలి



హుజూర్‌నగర్‌రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్



నేరేడుచర్ల : మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతి

హుజూర్‌నగర్‌రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అందేలా చూడాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అధికారులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్, ఎస్‌డీఎఫ్, సీడీపీ, ఎంపీఎల్‌ఏడీఎస్, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి మంజూరైన పనులపై పూర్తిస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు మరుగుదొడ్లు లేని వారు నూతనంగా నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. భర్త మృతి చెందిన భార్యకు 57సంవత్సరాలలోపు వారికి వితంతువు పెన్షన్ అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శాంతకుమారి, ఎంపీఓ మౌలానా, ఏఈఈ సాయిరాం, సూపరింటెండెంట్ నర్సిరెడ్డి, వివిధ గ్రామాల కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి ప్రణాళికపై సదస్సు

నేరేడుచర్ల : గ్రామాల్లోని అభివృద్ధి ప్రణాళికను త్వరితగతిన తయారు చేయాలని ఎంపీపీ లకుమళ్ల జ్యోతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీరాజ్, గ్రామీణ ఉపాధిహామీ శాఖల అధికారులతో జరిగిన సబ్‌కియోజన–సబ్‌కా వికాస్‌లో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జ్యోతిపద్మ, జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, ఎంపీడీఓ శంకరయ్య, ఎంపీఓ విజయకుమారీ, డిప్యూటీ తహసీల్దార్ శ్రవంతి, సర్పంచ్‌లు, పంచాయతీరాజ్ అధికారులు తదితరులున్నారు.

బీఎస్పీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న బీఎస్పీ నాయకులు

హుజూర్‌నగర్ : బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ)ని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ సాంబశివగౌడ్ అన్నారు. గురువారం పట్టణంలో ఆ పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయడానికి బూత్ లెవెల్, సెక్టార్ లెవెల్ కమిటీల నిర్మాణం చేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ చేసిన త్యాగాన్ని, ఏనుగు గుర్తును గడపగడపకు తీసుకెళ్లాలని సూచించారు. అదే విధంగా బీసీ జనాభాకు రావాల్సిన వాటా, బీసీలకు జరుగుతున్న అన్యాయం గురించి వివరించారు. త్వరలో బీసీల కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేయనున్నట్లు ఆయన తెలిపారు. బడ్జెట్‌లో బీసీలకు తక్కువ నిధులు కేటాయించడం బీసీలను చిన్నచూపు చూడడమేనని అన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్‌కు ఓటుతో బుద్ధిచెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షుడు మంద రవి, రాష్ట్ర కార్యదర్శి డి.శ్రీనివాస్‌యాదవ్, నాయకులు బి.సుబ్బుగౌడ్, నరసింహారావు, వెంకటరమణ, హుస్సేన్, వి.కరుణాకర్, వెంకటేశ్వర్లు, ప్రేమ్‌కుమార్, సురేష్‌బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలి

గరిడేపల్లి : పార్లమెంట్‌లో బీసీ బిల్లును ప్రవేశపెట్టి తక్షణమే ఆమోదించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 70కోట్ల మందికి పైగా బీసీలు ఉన్నారని, వారందరూ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిపోయారని, జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. సమావేశంలో సత్యం, అప్పయ్య, కందుల వెంకటేశ్వర్లు, గోవింద్ తదితరులున్నారు.

ఐఎన్‌టీయూసీ ప్లీనరీని జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగన్న

హుజూర్‌నగర్ : ఢిల్లీలో ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించే ఐఎన్‌టీయూసీ ప్లీనరీని జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ కోరారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలోనే ఐఎన్‌టీయూసీ 80లక్షల సభ్యత్వం కలిగి ఉందన్నారు. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి అధిక సంఖ్యలో డెలిగేట్లు పాల్గొన్నాలని ఆయన కోరారు. ప్రధాని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ ఏడాది ఉద్యమ కార్యచరణను అన్ని కార్మిక సంఘాలు కలిసి ప్రకటించాయని తెలిపారు. సమావేశంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య, ప్రధాన కార్యదర్శి జి.కరుణాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్, ఐఎన్‌టీయూసీ మండల, జిల్లా నాయకులు ఎం.ముక్కంటి, పి.రామరాజు, ఎండీ.ముస్తఫా, ఎస్.జానయ్య, సీహెచ్.రాము, చప్పిడి సావిత్రి, సుదర్శన్, రవీందర్, జాన్‌సైదా, పుల్లయ్య, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి



ఆలయంలో ఏర్పాటు చేసిన విద్యుత్‌దీపాలు

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో ప్రతి ఏడాది వైభవంగా నిర్వహించే కనకదుర్గమ్మ జాతర (బండ్ల పండుగ)కు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి శివరాత్రి ముందు వచ్చే గురు, శుక్ర, శనివారాల్లో ఈ జాతర జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ జాతర సందర్భంగా గురువారం రైతులు ప్రభబండ్లను అలకరించి ఊరేగింపుగా ఆలయ వద్దకు తీసుకొని వచ్చారు. అక్కడ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అక్కడే బండ్లను వదలేశారు. శుక్రవారం అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించిన అనంతరం వనభోజనాలకు వెళ్తారు. శనివారం ప్రభలను ఇంటికి తీసుకొనిపోవడం ఇక్కడి ఆచారం. జాతర సందర్భంగా వివిధ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా కోలాట ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోదాడరూరల్ సీఐ నాగదుర్గాప్రసాద్, ఎస్‌ఐ చల్లా శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాఠశాలల వార్షికోత్సవం



విద్యార్థినికి మెమొంటో ఇస్తున్న ఫాదర్

మఠంపల్లి : మండల కేంద్రంలోని వీవీహెచ్‌ఎస్, మౌంట్‌ఫోర్ట్ పాఠశాలల వార్షికోత్సవాన్ని గురువారం ఆ పాఠశాలలో ఘనంగా సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి, ఫాదర్ మార్టిన్, బ్రదర్‌లు వినోద్‌రెడ్డి, పేత్రూస్, రామచంద్రయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీలపై వివక్ష చూపిస్తున్న ప్రభుత్వాలు



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబుగౌడ్

గరిడేపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలపై వివక్ష చూపిస్తున్నాయని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు రాంబాబుగౌడ్ ఆరోపించారు. గురువారం మండలంలోని కీతవారిగూడెంలో జరిగిన బీసీ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈనెల 6న ప్రవేశపెట్టిన బడ్జెట్ బీసీలను నిరాశ పరిచిందని, మూడు లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీలకు తూతూ మంత్రంగా బడ్జెట్‌ను కేటాయించడం దురదృష్టకరమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కూడా బీసీలు అన్ని విధాలుగా వివక్షతకు గురవుతూనే ఉన్నారన్నారు. ఆయా ప్రభుత్వాలు బీసీలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అణగతొక్కుతున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో సంఘం నాయకులు మంగళగిరి వెంకన్న, వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, సైదులు తదితరులున్నారు.

మన ఊరు- మన బడి పనుల పరిశీలన

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను గురువారం ఎంపీడీఓ ఎం.యర్రయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట మండల విద్యాధికారి ఎండీ.సలీంషరీఫ్, ఎంపీఓ ఎర్ర లింగారెడ్డి, మొక్క భిక్షపతి, శెట్టి సతీష్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ కోతలను నియంత్రించాలని ధర్నా



నడిగూడెం : సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

నడిగూడెం : మండలంలో వ్యవసాయానికి విద్యుత్ కోతలు నియంత్రించాలని గురువారం మండల కేంద్రానికి చెందిన రైతులు స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. వ్యవసాయ బోర్లు, బావులకు ఇష్టారాజ్యంగా విద్యుత్ కోతను విధిస్తున్నారని, విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు నక్క సైదులు, గునుగుంట్ల పెదలింగరాజు, చిమట వీరబాబు, పోతురాజు, నరేష్, మహేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతను నిలిపివేయాలని వైఎస్సార్‌టీపీ జిల్లా కార్యదర్శి కన్నెబోయిన రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని రత్నవరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొద్దిరోజులుగా వ్యవసాయానికి, ఇళ్లలకు విద్యుత్‌ను ఇష్టారాజ్యంగా కోత విధిస్తున్నారని, దీంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం విద్యుత్ కోతను నిలిపివేయాలని కోరారు.

సీపీఎం నాయకుడు పున్నంరాజుకు ఘన నివాళి



మఠంపల్లి : పున్నంరాజు స్మారకస్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మఠంపల్లి : మండలంలోని యాతవాకిల్లలో సీపీఎం సీనియర్ నాయకుడు అమరజీవి కోలాహలం పున్నంరాజు వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారకస్థూపం వద్ద నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కోలాహలం కృష్ణంరాజు, లక్ష్మీనరసింహరాజు, విశాలాంధ్ర, పద్మ, నాగయ్యయాదవ్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో..

మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో కోలాహలం పున్నంరాజు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా, మండల నాయకులు పాండునాయక్, బాలునాయక్, జగన్‌మోహన్‌రెడ్డి, రన్మియా, కోటయ్య, వాలీబాయి, వినోదు, లింగయ్య, రాము, హరియా, శంభయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని శ్రీనివాసపురంలో సీపీఎం సీనియర్ నాయకుడు కోలహలం పున్నంరాజు వర్ధంతిని ఆ పార్టీ మండల కమిటీ సభ్యురాలు తంగెళ్ల వెంకటచంద్ర ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ పారుపల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు గోపరాజు, నారాయణరెడ్డి, శ్రీనివాస్, స్వామిగౌడ్, శశికళ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శక్తికేంద్ర కార్నర్ సమావేశాలు

హుజూర్‌నగర్ : ప్రతి మండలంలో శుక్రవారం నుంచి ఈనెల 25వరకు శక్తికేంద్ర కార్నర్ సమావేశాలు నిర్వహించాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో ప్రజాగోస – బీజేపీ భరోసా శక్తి కేంద్రాల సభల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సమావేశాల్లో అన్ని మోర్చాల అధ్యక్షులు, జిల్లా పదాధికారులు హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ గంధం సతీష్, నాయకులు ముస్కుల చంద్రారెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు మేకల వెంకటేశ్వర్లు, డి.రామరాజు, కోటయ్య, యల్ల య్య, వెంకటేశ్వర్లు, గోపి, సోమయ్య, ఎం.శ్రీను పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్‌రెడ్డి

15న సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

గరిడేపల్లి : తెలంగాణ ప్రభుత్వం ఈనెల 15న నిర్వహిస్తున్న సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు గుగులోతు సందీప్‌నాయక్ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన జాతీకి వన్నెతెచ్చిన మహానుభావుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ జయంతిని అధికారికంగా నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో సంఘం నాయకులు నరేందర్‌నాయక్, నాగేశ్వర్‌రావు నాయక్, పాండునాయక్, నాగరాజునాయక్, లక్ష్మణ్‌నాయక్ తదితరులున్నారు.